క్లుప్తంగా

పదవీ విరమణ జీవితం ఆనందంగా సాగాలి

నలుగురు పోలీసు అధికారులకు వీడ్కోలు పలికిన ఎస్పీ శ్రీనివాసరావు



నరసరావుపేట: పదవీ విరమణ అనంతర జీవితం ఆరోగ్యంతో కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపాలని జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు పేర్కొన్నారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో 40 ఏళ్లపాటు పోలీసు శాఖలో చిత్తశుద్ధి, అంకిత భావంతో ఉద్యోగ బాధ్యతలు నిర్వహించి పదవీ విరమణ చేసిన నలుగురికి పోలీసు మర్యాదలతో సత్కరించి ఆత్మీయ వీడ్కోలు పలికారు. పదవీవిరమణ పొందిన వారిలో సీసీఎస్ ఎస్ఐ కె.కరుణాకర రావు, డీసీఆర్‌బీ ఎస్ఐ ఏ.రఘుపతిరావు, యడ్లపాడు, చిలకలూరిపేట రూరల్ పీఎస్‌లలో పనిచేస్తున్న కానిస్టేబుళ్లు కె.వెంకట సుబ్బారావు, కానిస్టేబుల్ డి.సాల్మన్‌రాజు ఉన్నారు. క్రైం అదనపు ఎస్పీ సీహెచ్.లక్ష్మీపతి, ఏఆర్ అదనపు ఎస్పీ రామచంద్రరాజు, ఏఆర్ డీఎస్పీ గాంధీరెడ్డి, ఎస్బీ సీఐ బి.సురేష్‌బాబు, డీసీఆర్‌బీ సీఐ సుభాషిణి, పోలీసు కార్యాలయ ఏఏవో కేవీడీ రామారావు, ఆర్‌ఐలు గోపీనాథ్, ఎస్.కృష్ణ, యువరాజ్, జిల్లా పోలీసు అసోసియేషన్ అధ్యక్షులు టి.మాణి క్యాలరావు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వాడవాడలా వైఎస్సార్ వర్ధంతి నిర్వహించాలి

మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి

నరసరావుపేట: మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి వర్ధంతిని ఈనెల రెండోతేదీ వాడవాడలా నిర్వహించాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి శనివారం ఒక ప్రకటనలో కోరారు. వైఎస్సార్ విగ్రహాలు ఉన్నచోట వాటికి రంగులు వేసి కార్యక్రమాలు చేయాలని, లేనిచోట వైఎస్సార్ చిత్రపటాలకు పూలమాలలు, పూలు, సేవా కార్యక్రమాలతో ఘనంగా నివాళులర్పించాలని సూచించారు. ప్రతి నాయకుడు, కార్యకర్త పాల్గొనాలని పిలుపునిచ్చారు.

ఖాతాదారులకు ముద్ర రుణాలు మంజూరు

శావల్యాపురం: అర్హత కలిగిన లబ్ధిదారులకు ముద్ర రుణాలను మంజూరు చేస్తామని ఎస్‌బీఐ శావల్యాపురం బ్రాంచ్ మేనేజరు వలేటి శివప్రసాద్ అన్నారు. శనివారం స్థానిక బ్రాంచ్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ వ్యవసాయ అనుబంధ రుణాలు తక్కువ వడ్డీకి మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. రుణాలు సకాలంలో చెల్లించిన రైతులకు మళ్లీ సత్వరమే రుణం ఇస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయ అనుబంధ, ముద్ర, వ్యాపార రుణాలు రూ. 5 కోట్లు మంజూరు చేసేందుకు లక్ష్యంగా ఎంచుకున్నట్లు వెల్లడించారు. ఇందులో దళారులు ప్రమేయం లేకుండా నేరుగా బ్యాంకు అధికారులను సంప్రదిస్తే, అర్హత కల్గియుంటే సత్వరమే బ్యాంకు నిబంధనలు మేరకు రుణాలు మంజూరు చేస్తామన్నారు.

పొలాల్లో నిలిచిన నీటిని బయటకు పంపుకోవాలి

నాదెండ్ల: తుఫాన్ ప్రభావంతో పంట పొలాల్లో నిలిచిన నీటిని పారద్రోలేందుకు రైతులు ఏర్పాటు చేసుకోవాలని వ్యవసాయాధికారి ఎ.హరిప్రసాద్ తెలిపారు. మరో రెండు రోజుల పాటూ తుఫాన్ ప్రభావం ఉంటుందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో పంట పొలాల్లో నిలిచిన వర్షపు నీటిని కాలువల ద్వారా బయటకు వెళ్లగొట్టాలన్నారు. పూర్తిగా వర్షం తగ్గిన తరువా సస్యరక్షణ చేపట్టినట్లయితే పత్తి పంటను కాపాడుకోవచ్చన్నారు. ఇప్పుడిప్పుడే పంట పొలాల్లో నీరు నిలుస్తున్నందున ఆది, సోమ వారాల్లో ఈ ప్రభావం ఎక్కువయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు.

85 శాతం పింఛన్లు పంపిణీ

శావల్యాపురం: మండలంలోని 11 గ్రామ సచివాలయాల పరిధిలో 5,947 మంది పింఛనుదారులకు 85 శాతం పింఛన్లు పంపిణీ చేసినట్లు మండల ప్రత్యేకాధికారి మూలె వెంకటరెడ్డి అన్నారు. శనివారం శావల్యాపురం గ్రామంలో పింఛను పంపిణీని క్షేత్రస్థాయిలో అధికారులు పరిశీలించారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా పింఛనుదారులకు పింఛను నగదు పంపిణీ చేయడంతో సచివాలయ ఉద్యోగులను ప్రత్యేకంగా అభినందించారు. ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య, పంచాయతీ కార్యదర్శి కానుగంటి మహేంద్ర, మహిళా పోలీసు గొసియాబేగం, సచివాలయ వెల్ఫేర్ సహాయకురాలు సింధుజ పాల్గొన్నారు.

జాగ్రత్త వహించండి

నరసరావుపేట: తుపాను కారణంగా నిరంతరంగా కురుస్తున్న వర్షాలతో విద్యుత్ ప్రమాదాలకు గురికాకుండా ప్రజలు కొన్ని జాగ్రత్తలు పాటించాలని విద్యుత్‌శాఖ ఏఈ వై.ఏడుకొండలు శనివారం హెచ్చరించారు. తడిసిన కరెంట్ స్తంభాలు, స్టార్టర్లు, మోటార్లు ముట్టుకోవద్దని సూచించారు. విద్యుత్ లైన్లకు తగిలే చెట్లను ముట్టుకోకుండా ఆ విషయాన్ని సంబంధిత అధికారికి తెలియచేయాలన్నారు. ఉరుములు మెరుపులతో వర్షం పడేటప్పుడు డిష్ కనెక్షన్ తీసివేయాలని, టీవీ, ఫ్రిడ్జ్, కంప్యూటర్లను స్విచ్‌లను ఆఫ్ చేయాలన్నారు.

తుఫాన్ సహాయక కేంద్రం

నాదెండ్ల: మరో రెండు రోజుల పాటూ తుఫాన్ ప్రభావం తీవ్రస్థాయికి చేరే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలతో కలెక్టర్ ఆదేశాల మేరకు నాదెండ్ల తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ ఏవీ రమణ తెలిపారు. 31వ తేదీ ఉదయం నుంచి 2వ తేదీ వరకూ పనిచేస్తుందని చెప్పారు. ప్రజలు ఏదైనా సమస్య తలెత్తితే 08647 252999, 9154959292లో సంప్రదించాలని కోరారు.



వర్షంతో జనసంచారం లేక బోసిపోయిన ఆర్టీసీ బస్టాండ్ సెంటర్ రోడ్డు



ఆర్టీసీ బస్టాండ్ ప్రవేశ మార్గంలో నిల్చిన వర్షపు నీరు



స్టేషన్ రోడ్డులో ట్రాఫిక్ పోలీసుస్టేషన్ ఎదుట నిల్చిన వర్షపు నీరు



కోటప్పకొండరోడ్డులో నిల్చిన వర్షపు నీరు, అందులో నుంచి ప్రయాణిస్తున్న ఆటో



చప్టా వద్దప్రవహిస్తున్న నీటిని పరిశీలిస్తున్న నరసరావుపేట కమిషనర్ రవిచంద్రారెడ్డి

జోరు వర్షం... జన జీవనం అతలాకుతలం



గణపవరం వద్ద నీట మునిగిన జూట్ పొలం



గణపవరం-చిలకలూరిపేట డొంక రోడ్డులో కుప్పగంజివాగు చప్టాను తాకుతున్న వరద నీరు



జలమయమైన చిలకలూరిపేట-గణపవరం డొంక రోడ్డు



చిలకలూరిపేట ఏఎంజీ సమీపంలో హైవేపై పారుతున్న వర్షపు నీరు



12వ వార్డులో పర్యటిస్తూ స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ

- పలు రోడ్లలో నిల్చిన వర్షపు నీరు
- రోడ్లపై విరిగిపడిన చెట్లు, కొమ్మలు
- పలు వార్డుల్లో పర్యటించిన ఎమ్మెల్యే చదలవాడ

నరసరావుపేట: నియోజకవర్గంలో గత 24 గంటల వ్యవధిలో భారీ వర్షం కురిసింది. దీంతో వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. పలుచోట్ల లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. చెట్లు, వాటి కొమ్మలు విరిగి రోడ్డుపై పడ్డాయి. చిత్రాలయ సెంటర్ నుంచి కోటప్పకొండకు వెళ్లే మార్గంలో ఓ వేపచెట్టు కూలి దానికింద నే పార్కింగ్ చేసి ఉన్న మినీలారీపై పడటంతో అది దెబ్బతింది. స్టేషన్‌రోడ్డు, కోటప్పకొండ రోడ్డు, పల్నాడు రోడ్డు తదితర ప్రదేశాల్లో రోడ్లపై నీరు నిలిచింది. ఆర్టీసీ బస్టాండ్ ప్రవేశమార్గంలో వర్షం నీరు నిలువటంతో ప్రయాణికుల రాకపోకలకు ఇబ్బందిపడ్డారు. రోడ్లపై పడిన వర్షపు నీటిని యుద్ధప్రాతిపదికన తొలగించేందుకు మున్సిపల్ అధికారులు, సిబ్బంది కృషి చేశారు.

పట్టణంలో పర్యటించిన ఎమ్మెల్యే చదలవాడ

ఏపీలో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తున్న సందర్భంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు కోరారు. శనివారం మున్సిపల్ కమిషనర్ సి.రవిచంద్రారెడ్డితో కలిసి సత్తెనపల్లిరోడ్డు, శివసంజీవయ్యకాలనీ, పట్టణ శివారు ప్రాంతాల్లో పర్యటించారు. లోతట్టు ప్రాంతాలు, రోడ్లపై నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని అన్నా రు. డ్రెయిన్లకు ఆటంకం లేకుండా సిబ్బందిని అప్రమ త్తం చేయాలన్నారు. స్థానికులను పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. వాగులు, వంకల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ప్రమాదాల బారిన పడకుండా చూడాలన్నారు. ఆయన వెంట టీడీపీ నాయకులు వాసిరెడ్డి రవి, మాజీ కౌన్సిలర్లు ఉన్నారు.

ఎడతెరిపి లేని వర్షం..

వినుకొండ(నూజెండ్ల): ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వినుకొండ పట్టణంలోని పలు వీధులు ప్రధాన సెంటర్లు జలమయంగా మారాయి. ఇసుక వాగు బజారు, పాత మార్కెట్ బజారు, పాత శివాలయం వీధితో పాటు రాజీవ్ రజక కాలనీ, ముట్లకుంటకాలనీల్లో నీరు నిలబడి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పట్టణంలోని వ్యాపార సంస్థలు, పాఠశాలలు వర్షం కారణంగా మూతపడ్డాయి. వినుకొండరూరల్ మండంలోని, పిట్టంబండ వద్దనున్న కొంకేరు, నూజెండ్లమండలం ప్రవహించే గుండ్లకమ్మ నదికి భారీగా వరదనీరు రావడంతో పొంగిపొర్లింది. విఠంరాజుపల్లి సమీపంలోని, పిచుకలపాలెం, చిన్నకంచర్ల వెళ్లేమార్గంలో ఉన్న రైల్వే అండర్‌పాస్‌లోకి భారీగా వర్షంనీరు చేరటంతో రాకపోకలకు ప్రజలు తీవ్రఇబ్బందులు ఎదుర్కొన్నారు. పలు గ్రామాలతోపాటు వినుకొండ పట్టణంలో విద్యుత్ సరఫరాకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.ఆర్టీసీ బస్టాండ్‌లో పాతబస్సుల్లో నీరు కారటంతో ప్రయాణికులు బస్సులో కూడా గొడుగులు చేపట్టి ప్రయాణం చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. మరి కొన్నిరోజులు వర్షాలు కురుస్తాయనే వాతవారణ శాఖ హెచ్చరికలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, దూరప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని మున్సిపల్, రెవెన్యూ, పోలీసు అధికారులు తెలిపారు.



వర్షం నీటిలో మునిగిన వినుకొండ పాత శివాలయం వద్ద రోడ్డు

జోరు వాన..

శావల్యాపురం: మండలంలో 15 గ్రామపంచాయతీలో 9 సెంటిమీటర్ల వర్షాపాతం నమోదు అయినట్లు తహసీల్దారు వేముల వెంకట నాగరాజు తెలిపారు. మెట్ట పంటలు సాగు చేసిన ఈవర్షం వలన పంటలకు ప్రాణం పోసినట్లు ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. శావల్యాపురంలో కొంకెరు వాగు వర్షపు నీరు ఉధృతి పెరిగింది. అలాగే మండలంలోని కనమర్లపూడి గ్రామం సమీపాన జాతీయ రహదారి మార్గం వెంబడి ఉన్న పెదకంచర్ల కాల్వ నీటి మట్టం పెరిగింది.



శావల్యాపురంలో కొంకెరు వాగు ఉధృతి

నరసరావుపేటలో....

నరసరావుపేట రూరల్: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం వలన మండలంలో శనివారం భారీ వర్షం కురిసింది. తెల్లవారుజాము నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. భారీ వర్షంతో వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. పెదరెడ్డిపాలెం సమీపంలోని కుప్పగంజి వాగు, గోనెపూడి సమీపంలోని ఏడుమంగళం వాగు పొంగి ప్రవహిస్తుండంతో రాకపోకలు నిలిచిపోయాయి. పెదరెడ్డిపాలెం వద్ద వాగు ఉధృతి ఎక్కువగా ఉండటంతో స్థానికులు ట్రాక్టర్లు అడ్డుగా పెట్టి వాహనాల రాకపోకలను నిలిపివేశారు. వాగు పొంగి ప్రవహిస్తుండంతో సమీపంలోని పంట పొలాలు మునిగిపోయాయి. పాలపాడు- పరగటిచర్ల గ్రామాల మధ్య చప్టాపై రెండు అడుగుల మేర నీరు ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. భారీ వర్షం కారణంగా పైనుంచి వస్తున్న వరద నీరు వల్లప్పచెరువుకు భారీగా వచ్చి చేరుతోంది. దీంతో చెరువు నిండుకుండలా మారింది. చెరువు నిండిపోవడంతో రెండు అలుగుల ద్వారా పెద్ద ఎత్తున నీరు బయటకు ప్రవహిస్తుంది. భారీ వర్షం కూరగాయలుతో పాటు మినుము, పెసర పంటలకు తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. గత 20రోజులుగా బెట్ట వాతావరణం కారణంగా పత్తి రైతుల్లో ఆందోళన నెలకొంది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షంతో పత్తి పంటకు మేలు చేకూరింది.



గుంటూరు-కర్నూలు జాతీయరహదారి పై వానలో తడుస్తున్న వినాయక విగ్రహాలు

పొంగిపొర్లుతున్న వాగువంకలు

నాదెండ్ల: అస్నా తుఫాన్ ప్రభావంతో జనజీవనం స్తంభించింది. శనివారం తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకూ ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తూనే ఉంది. కొన్ని గ్రామాల్లో లోతట్టు పంట పొలాలు నీట మునిగాయి. డొంక రోడ్లు జలమయమయ్యాయి. జాతీయ రహదారి ఏఎంజీ సమీపంలో సగం పైగా రోడ్డును నీటి ప్రవాహంతో ముంచెత్తింది. గణపవరం నుంచి చిలకలూరిపేట వెళ్లే డొంక రోడ్డు పూర్తిగా నాలుగు అడుగుల మేర వర్షపు నీరు పారటంతో రాకపోకలు స్తంభించాయి. కుప్పగంజివాగు చప్టా లెవల్ వరకూ నీరు పారుతోంది. తూబాడు, గొరిజవోలు సమీపంలో రోడ్లపై నీరు ప్రవహించి రాకపోకలు స్తంభించాయి. పలుచోట్ల చెట్లు విరిగి రోడ్డుపై పడ్డాయి. మరో రెండు రోజుల పాటూ తుఫాన్ ప్రభావం ఎక్కువగా ఉందని అధికారులు హెచ్చరికలతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజలు సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని సూచనలు చేశారు.

పొంగి పొర్లుతున్న వాగులు

రొంపిచర్ల: మండలంలోని అన్ని గ్రామాల్లో శనివారం ఎడతెరపి లేకుండా భారీ వర్షం కురిసింది. వర్షం ప్రభావంతో మండలంలోని ఓగేరువాగు, గాడిదల వాగు, ఊరవాగు, ఎద్దువాగు, కారంపూడివాగు, నక్కలవాగు, ఏడుగడియల వాగు, అన్నారపు వాగు, కొండవాగులన్నీ ఉధృతిగా ప్రవహిస్తున్నాయి. మాచవరం, మునమాక, విప్పర్లపల్లి గ్రామ సమీపంలోని వాగులు ఉధృతిగా ప్రవహించటంతో రాకపోకలు నిలిచి పోయాయి. వర్షంతో గత రెండు రోజులుగా నాట్లు వేసిన పొలాలు నీటమునిగాయి. వరినారు మడులు, మిర్చి, పెసర, మినుము, పత్తి పైర్లు సహితం వర్షపు నీరు నిలిచింది. మండల కేంద్రమైన రొంపిచర్లలో శనివారం ఉదయానికి 35.2 ఎం.ఎం వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ కార్యాలయ అధికారులు తెలిపారు. అలాగే మండలంలోని చాకలికుంటతండాలో హంసావత్ చినతులసీ నాయక్ కు చెందిన పూరిల్లు వర్షానికి నాని కూలి పోయింది.

రొంపిచర్లలో..

రొంపిచర్ల: మండలంలో శనివారం ఉదయం 8.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు 220.2 ఎం.ఎం వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ కార్యాలయ అధికారులు తెలిపారు. నరసరావుపేట డివిజన్‌లోనే రొంపిచర్ల మండలంలో అత్యధిక వర్షపాతం నమోదైందన్నారు. డివిజన్‌లో 921.8 ఎం.ఎం వర్షపాతం నమోదు కాగా సగటున 92.2 ఎం.ఎం వర్షపాతం నమోదైంది. కాగా బొల్లాపల్లిలో 119.4 ఎం.ఎం. వర్షపాతం నమోదు కాగా శావల్యాపురంలో 90.2, నరసరావుపేటలో 86.2, యడ్లపాడులో 84.8, చిలకలూరిపేటలో 78.6, నాదెండ్లలో 70.4, ఈపూరు 61.4, వినుకొండ 56.2, నూజెండ్ల 54.8 ఎం.ఎం వర్షపాతం నమోదైంది. రొంపిచర్ల మండలంలోని మునమాక, ముత్తనపల్లి గ్రామాల వద్ద ప్రధాన రహదారిపై వాగులు బ్రిడ్జీపై పొంగి ప్రవహిస్తున్నాయి. ఈ రహదారి మీదుగా రాకపోకలు నిర్వహించవద్దని అధికారులు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. రెవెన్యూ, పంచాయతీ శాఖ అధికారులు గ్రామాల్లోనే ఉండి ఎప్పటికప్పుడు పరిస్థితులు తెలియజేయాలని తహసీల్దార్ ఆదేశాలు జారీ చేశారు.



పెద్దరెడ్డిపాలెం వద్ద పొంగి ప్రవహిస్తున్న కుప్పగంజి వాగు



విప్పర్లపల్లి గ్రామ సమీపంలో పొంగి ప్రవహిస్తున్న ఏడుగడిల వాగు



విఠంరాజుపల్లి పిచుకలపాలెం మార్గంలో రైల్వే అండర్‌పాస్‌లో నీరునిలిచిన దృశ్యం



నరసరావుపేట శివారులో నీటమునిగిన వరి పొలాలు



కనమర్లపూడిలో పెదకంచర్ల కాల్వ వద్ద నెలకొన్న వరద నీటి ఉధృతి

ఆక్రమణల తొలగింపు విషయంలో వివక్ష

చిలకలూరిపేట: పట్టణంలోని కేబీ రోడ్డులో డ్రెయిన్లలో సిల్ట్ తొలగిస్తున్నారా.. లేక ఆక్రమణలు తొలగిస్తున్నారా స్పష్టత ఇవ్వాలని మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు పోలిశెట్టి మస్తాన్‌రావు డిమాండ్ చేశారు. మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం మైలవరపు గుండయ్య కౌన్సిల్ హాలులో శనివారం నిర్వహించారు. సమావేశానికి మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని అధ్యక్షత వహించారు. అజెండాలోని అంశాలు చదవడం పూర్తి అయిన వెంటనే మస్తాన్‌రావు ఆక్రమణల విషయాన్ని ప్రస్తావించారు. దీనికి మున్సిపల్ కమిషనర్ సీహెచ్ గోవిందరావు సమాధానం చెబుతూ డ్రైన్లలో సిల్ట్ తొలగిస్తున్నామని, డ్రెయిన్ల వరకు వచ్చిన ఆక్రమణలను తొలగింపు చేస్తామని తెలిపారు.

ఈ విషయమై పదోవార్డు కౌన్సిలర్ బేరింగ్ మౌలాలి మాట్లాడుతూ కేవలం కేబీ రోడ్డులో మాత్రమే ఆక్రమణలపై మాత్రమే ఎందుకు దృష్టి సారించారు. పట్టణంలోని మెయిన్‌బజారు, కళామందిర్‌సెంటర్ రోడ్లు తీవ్రంగా ఆక్రమణలకు గురైఉన్నాయి. వీటి విషయమై ఎందుకు దృష్టి సారించటం లేదు. ఆక్రమణల విషయంలో వివక్ష చూపుతున్నారు. డబ్బు తీసుకొని కొన్ని చోట్ల ఆక్రమణల జోలికి వెళ్లడం లేదని తీవ్రంగా ఆరోపించారు. చేసే పని సక్రమంగా చేయాలని హితవు పలికారు.

ఎందుకు అద్దెలు వసూలు చేయరు...

మున్సిపల్ షాపుల అద్దె విషయమై పదో వార్డు కౌన్సిలర్ బేరింగ్ మౌలాలి మాట్లాడుతూ గత ఏడు సంవత్సరాల నుంచి మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లోని ఆరు షాపుల వద్ద నుంచి సుమారు రు.20ల క్షలు అద్దెలు రావాలి. వాటిని ఎందుకు వసూలు చేయడం లేదని, ఇదే విషయాన్ని కౌన్సిల్ సమావేశాల్లో ఏడాదిన్నరగా ప్రశ్నిస్తున్నా సరైన సమాధానం లభించటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందులోని మతలబు ఏమిటో అధికారులు తెలపాలని కోరారు. సమావేశంలో పలువురు కౌన్సిలర్లు మాట్లాడారు. అనంతరం అజెండాలోని అన్ని అంశాలను సభ్యులు ఆమోదిస్తూ సమావేశం ముగించారు.

అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదం

వినుకొండ(నూజెండ్ల): వినుకొండ(నూజెండ్ల): స్థానిక మున్సిపల్ సమావేశ మందిరంలో మున్సిపల్ లత్యవసర,సమావేశం శనివారం నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ డాక్టర్ దస్తగిరి అధ్యక్షతన జరిగిన సమావేశంలో కమిషనరు సుభాష్ చంద్రబోస్ మున్సిపల్‌అజెండాలోని అంశాలను కౌన్సిల్ సభ్యులముందు ప్రవేశపెట్టారు. ఎజెండాలో పొందుపరచిన, అంశాలను కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. కార్యక్రమంలో మున్సిపల్ డి.ఈ.ఈ వెంకయ్యలతో పాటు వార్డు కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

ఇంటింటికీ రేషన్ పంపిణీ

నరసరావుపేట: జిల్లాలో నేటి నుంచి 6,45,110 మంది కార్డుదారులకు ఉదయం ఏడుగంటల నుంచి ఎండీయూ వాహనాల ద్వారానే ఇంటింటికీ రేషన్ సరుకులు పంపిణీ జరుగుతుందని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ఎస్.పద్మశ్రీ శనివారం వెల్లడించారు. ఫోర్టిఫైడ్ బియ్యం తెలుపురంగు కార్డుదారులకు ఒక్కొక్కరికీ ఐదు కిలోల చొప్పున, ఏఏవై కార్డుదారులకు కార్డు ఒక్కింటికీ 35 కేజీలు ఉచితంగా పంపిణీ చేస్తారన్నారు. ఈనెల నుంచి తెలుపు రంగు కార్డుదారునికి అర కేజీ పంచదార రూ.17లకు, ఏఏవై కార్డుదారులకు ఒక కేజీ రూ.13.50లకు నూతన ప్యాకింగ్‌తో అందించబడుతుందన్నారు. కార్డుదారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

హత్య కేసులో నిందితుల అరెస్టు

చిలకలూరిపేటటౌన్: హత్య కేసులో నిందితులు నలుగురిని అర్బన్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం... పిడుగురాళ్ల సమీపంలోని కొండమోడు విద్యుత్ కార్యాలయంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి రమావత్ నందునాయక్ (36)ఈ ఏడాది జులై 9 తేదీన పట్టణంలోని గ్రంథాలయం బజారులో స్పృహతప్పి తీవ్రగాయాలతో పడి ఉన్నాడు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు సంఘటనా స్థలానికి చేరుకుని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరుసటి రోజు మృతి చెందాడు. నరసరావుపేట డీఎస్పీ కె.నాగేశ్వరరావు ఆదేశాలతో పట్టణ సీఐ పి.రమేష్ నేతృత్వంలో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. మద్యం మత్తులో నందునాయక్ పట్టణంలోని బొందిలిపాలెం రావిచెట్టు వీధిలోని ఇళ్లల్లోకి వెళ్లే ప్రయత్నం చేశాడు. అక్కడి వారు ఎంత వారించినా వినకపోవడంతో అతనిపై దాడి చేశారు. స్పృహ కోల్పోవడాన్ని గమనించి అతన్ని గ్రంథాలయం వీధిలో బైక్‌పై తెచ్చి పడేసినట్లు పోలీసుల విచారణలో తెలిసింది. దీంతో నిందితులైన చేజర్ల గిరిహనుమాన్ సింగ్, సులేమాన్, క్షత్రి సాయిసింగ్, కారుమూరి గిరి దుర్గా ప్రసాద్ పోలీసుల ముందు నేరం ఒప్పుకోవడంతో గతనెల 30వ తేదీ శుక్రవారం అదుపులోకి తీసుకుని కోర్టుకు హాజరుపరిచనట్లు తెలిపారు.

మహాలక్ష్మమ్మ సేవలు అభినందనీయం

శావల్యాపురం: అంకిత భావంతో విధులు నిర్వహించిన ప్రభుత్వ ఉద్యోగులు ప్రజల మన్ననలు పొందుతారని తహసీల్దారు వేముల వెంకట నాగరాజు అన్నారు. శనివారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఆఫీస్ సబార్డినేట్ విధులు నిర్వహిస్తున్న కొండ్రముట్ల మహాలక్ష్మమ్మ పదవీ విరమణ అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 33 సంవత్సరాల పాటు సేవలు మెరుగైన సేవలందించారని అభినందించారు.

ఆధ్యాత్మిక సేవా స్రవంతి నూతన కార్యవర్గం

నరసరావుపేట ఈస్ట్: ఆధ్యాత్మిక సేవా స్రవంతి నూతన కమిటీ అధ్యక్షునిగా మండవ వెంకటరత్నం, ప్రధాన కార్యదర్శిగా బండి కొండారెడ్డి, కోశాధికారిగా చౌడం చంద్రరావు ప్రమాణ స్వీకారం చేశారు. సంస్థ ద్వితీయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని సంస్థ వ్యవస్థాపకుడు జల్లి శ్రీనివాసరావు అధ్యక్షతన శ్రీపట్టాభిరామ స్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి ఏర్పాటు చేసిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చీఫ్ ఆర్గనైజర్‌గా పి.నాగపద్మిని, కోఆర్డినేటర్‌గా బాణావత్ రుద్రమదేవి ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గంతో ముదిరాజ్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ ఈ.ఎం.స్వామి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈసందర్భంగా శ్రావణమాస వైభవంపై ఆంధ్రోపన్యాసకులు మంత్రిరాజు శివరామయ్య ప్రవచనం, తోట వెంకట దీప్తిశ్రేయ కూచిపూడి నృత్య ప్రదర్శన అలరించాయి. అలాగే వివిధ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ నాగసరపు సుబ్బరాయగుప్త, సంస్థ మాజీ అధ్యక్షులు మునగా శ్రీనివాసరావు, రెడ్డి మురళీకృష్ణ, చేగు వెంకటేశ్వరరావు, వెలంపల్లి కేశవరావు పాల్గొన్నారు.



ఆధ్యాత్మిక సేవా స్రవంతి నూతన కార్యవర్గ ప్రతినిధులు

17 మంది జేఎన్‌టీయూఎన్ విద్యార్థులకు ఉద్యోగాలు

నరసరావుపేట రూరల్: కాకాని జేఎన్‌టీయూఎన్ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన 17 మంది విద్యార్థులు గెలాక్సీ సొల్యూషన్స్ సంస్థ నిర్వహించిన క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సిహెచ్. శ్రీనివాసరావు శనివారం తెలిపారు. ఈనెల 29,30 తేదీలలో నిర్వహించిన ఎంపికలలో సీఎస్ఈ బ్రాంచ్ విద్యార్థులు 13 మంది, ఈసీసీ బ్రాంచ్ విద్యార్థులు ముగ్గురు, మెకానికల్ బ్రాంచ్ విద్యార్థి ఒకరు ఉద్యోగాలు సాధించినట్లు తెలిపారు. అసోసియేట్ డెవలపర్‌గా ఉద్యోగాలకు ఎంపికై న విద్యార్థులకు మొదటి సంవత్సరం రూ.5 లక్షలు, రెండవ సంవత్సరం రూ.7.5 లక్షలు, మూడవ సంవత్సరం రూ.11 లక్షలు ప్యాకేజీ పొందుతారని వివరించారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ సిహెచ్.శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ వైఎస్ కిశోర్‌బాబు అభినందించారు.



ఎంపికైన విద్యార్థులతో జేఎన్‌టీయూఎన్ ప్రిన్సిపల్ శ్రీనివాసరావు, విభాగాధిపతులు